# మన సొమ్ముతో... మన బతుకుతో... చెలగాటం!

జయప్రకాష్ నారాయణ్

**BB-01-May-2006**

కనిపించిన నూకలు, కనిపించని వలలు, వేటగాడి ఆశలు - పంచతంత్రం కథలోనివి... కలర్ టీవీల వాగ్దానాలు, వట్టిపోయే ఖజానాలు, పార్టీల మాయాజాలం - మన ఎన్నికల తంత్రంలో కుహకాలివి.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలన్నవి కేవలం ప్రతినిధులను ఎన్నుకోవడానికో, పరిపాలన బాధ్యతను ఏ పార్టీకి అప్పగించాలో నిర్ణయించడానికో కాదు. ఎన్నికలు రాజకీయ విజ్ఞానాన్ని అందజేయాలి. భవిష్యత్ ప్రాధాన్యాల నిర్ణయానికి దోహదపడాలి.



భారతదేశంలో ఎన్నికల సందర్భంగా ప్రజాస్వామిక ఉత్సాహం ఉరకలెత్తుతుంది. కానీ, మనది పేద దేశం. ప్రజలు ఎన్నో ఆశిస్తారు. చివరకు భంగపడుతుంటారు. అవినీతి పెచ్చుమీరిపోయింది. పరిపాలన వ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. ఇలాంటి సందర్భాల్లో - ప్రజల బాగు కోసం పనిచేయవలసిన అవసరాన్ని పార్టీలకు ఎన్నికలు గుర్తుచేస్తుంటాయి. ఎన్నో దశాబ్దాలు గడిచినా- అర్థవంతమైన మార్పుల కోసం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే సాధనంగా ఎన్నికలను ఉపయోగించుకోవడంలో అనేక పార్టీలు విఫలమయ్యాయి. ఎవరు పరిపాలించాలో నిర్ణయించే మార్గంగా ఎన్నికలు మారిపోయాయి. ప్రజల ఆశలు- ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థను రాజకీయ పార్టీలు తీర్చిదిద్దలేకపోయాయి. మన ఎన్నికలకు సంబంధించి కొట్టొచ్చినట్టు కనిపించే అంశాలు రెండున్నాయి. మొదటిది- ఎన్నికల్లో తరచుగా అధికారంలో ఉన్న పార్టీ ఓడిపోతుంటుంది. ఓటర్లు మార్పు కోరుకుంటున్నారనడానికి ఇలాంటి తీర్పులు నిదర్శనాలు. కానీ పార్టీల తీరు వేరు. రాజకీయ ప్రక్రియనే ఓటర్లు అభిశంసించారని అవి అపార్థం చేసుకుంటాయి. పరిపాలన తీరుతెన్నుల్ని మెరు

గుపరచుకోవడంపై దృష్టిసారించే బదులు, ప్రభుత్వ వ్యతిరేక ఓటు అనివార్యమైనదం టూ ఆత్మఘాతుక అన్వ యాలు చెబుతుంటాయి. రెం డోది- ఓటర్లను ఏదో విధంగా బుట్టలో పడేసేందుకు పార్టీలు సిగ్గుమాలిన, అర్థంపర్థంలేని జనాకర్షక కార్యక్రమాలకు తెగబడుతుంటాయి.

*తమిళనాడులో 'తాయిలాలు'*

ఓట్లు కొల్లగొట్టేందుకు ఎంతకైనా తెగించగలరనడానికి ప్రస్తుత తమిళనాడు ఎన్నికలే తార్కాణం. ప్రతి కుటుం బానికీ కలర్ టెలివిజన్ ఇస్తామని డి.ఎం.కె. కూటమి హామీ ఇచ్చింది. ఇలాంటి హామీలన్నీ ఎన్నికల గిమ్మి క్కులుగానే మిగిలిపోతాయనడానికి చరిత్రే సాక్షి. ఓట్ల కోసం డబ్బులు, మద్యం పంచడం చాలామంది అభ్య ర్థులకు అలవాటే. ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థులిద్దరూ ఒకే రకమైన వ్యూహాలు అనుసరించినప్పుడు, ఒకరిని మించి మరొకరు ఓట్ల కొనుగోలుకు ప్రయత్నించినప్పుడు - ఇరువురి తప్పులూ మరుగున పడిపోతాయి. ఎవరు గెలిచినా- ఫలితమొక్కటే. ఓట్లు కొల్లగొట్టేందుకు ప్రజాధనాన్ని దుర్వినియోగపరచే ప్రక్రియలో మన రాజకీయ నాయకులు 1970ల ప్రారంభం నుంచే రాటుదేలిపోయారు. పేదరికాన్ని నిర్మూలించడానికే ఈ హామీలని చెబుతుంటారు. కానీ, అమాయకులైన పేదలు మాత్రం ఓటు బ్యాంకులుగానే మిగిలిపోయారు. దారిద్ర్యాన్ని తరిమికొట్టడంలో పెద్దగా సాధించిందేమీ లేదు.

1970ల నాటి గరీబీ హటావో రాజకీయాలు, పేదల సంక్షేమానికంటూ ఎన్టీఆర్, ఎమ్జీఆర్ చేపట్టిన పథకాల వల్ల ఓటు బ్యాంకులు పదిలమయ్యాయే తప్ప, బీదవారి పరిస్థితి పెద్దగా మారలేదు. 1987లో హర్యానాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా సాగునీటి సరఫరాకు సంబంధించి దేవీలాల్ ఇచ్చిన హామీని- అత్యంత నికృష్ట మైనదిగా పేర్కొనవచ్చు. కాంగ్రెస్ వాళ్లు సాగునీటిని కాలువలకు విడుదల చేసేముందు జలవిద్యుత్ ఉత్పాద నకు ఉపయోగించడం ద్వారా శక్తిహీనం చేస్తున్నారని, తాను అలా కాకుండా నేరుగా సాగునీటిని అందజేస్తా నని ఆయన హామీ ఇచ్చి కలకలం రేపారు. రైతుల రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇవ్వడం ద్వారా 1989లో ఆయన మరోసారి సంచలనం సృష్టించారు. చివరికి 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం రైతు రుణాలను మాఫీ చేసింది. కానీ పరపతి వ్యవస్థ పతనమైంది. రుణ విమోచన తరవాత కూడా రైతుల కష్టాలు, కడ గండ్లు తీరలేదు.

ఇక, ఉచిత విద్యుత్తు. ఇది చాలా కాలంగా ఎన్నికల్లో ప్రధాన ప్రచారాస్త్రంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ రాజకీయాలు నడిపాయి. విద్యుత్తు ఉచి తమే అంటున్నప్పటికీ- కొత్త కనెక్షన్లు, సేవల కోసం రైతులు భారీయెత్తున లంచాలు ఇవ్వాల్సి వస్తోంది. విద్యుత్ సరఫరా కూడా సవ్యంగా లేదు. పైగా దీనివల్ల విద్యుత్ సంస్థలు భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. ఇవి స్వల్పకాలిక చర్యలే అయినా- ప్రభుత్వాలకు భారీ ప్రయోజనమే చేకూర్చాయి.

ఓట్లేసిన వారందరికీ రంగుల టీవీ ఇస్తామంటూ తమిళనాడు ఎన్నికల్లో డి.ఎం.కె. చేస్తున్న వాగ్దానం మరీ విడ్డూరంగా ఉంది. ఓటరును ఇలాంటి వాగ్దానాలతో యాచకుల స్థాయికి దిగజార్చేందుకు కరుణానిధి ప్రయ త్నిస్తున్నారు. లక్నోలో 2004లో ఓ రాజకీయ పార్టీ ఉచితంగా చీరలను పంపిణీ చేసిన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఎంతోమంది పేద మహిళలు ప్రాణాలు కోల్పోయారు. అత్యంత దురదృష్టకరమైన ఇలాంటి సంఘటనలు ఎప్పుడోగానీ జరగవు. కానీ తమిళనాడులో జరుగుతున్న తంతును గమనిస్తే- ప్రజల స్థాయిని దిగజార్చే పరంపరను కరుణానిధి వ్యవస్థీకృతం చేయాలనుకుంటున్నట్లు కనిపిస్తోంది.

ఎన్నికల వాగ్దానాలన్నింటికీ ఓట్లే లక్ష్యమైనప్పుడు... కరుణానిధి విచ్చలవిడిగా చేస్తున్న వాగ్దానాల్లో తప్పేముం దన్న ప్రశ్న తలెత్తవచ్చు. కానీ, అందరికీ టీవీలను ఇస్తామన్న వాగ్దానంతో రాజకీయ నాయకులు ఈ దఫా

అన్నిరకాల పరిధులనూ తుంగలో తొక్కారు. ఎన్నికలంటేనే హామీలు, వాగ్దానాలు. కొన్ని వాగ్దానాలను నిలబెట్టుకుంటుంటారు, మరికొన్నింటిని అధికారం చేతిలోకి రాగానే మరచిపోతుంటారు. ఎన్నికల వాగ్దానాలు దేశ ప్రయోజనాలను దెబ్బతీసే పక్షంలో... వాటిని అమలు చేయకపోవడమే సమాజానికి మేలు చేస్తుంది. ఉచిత-బియ్యం, గేదెలు, గొర్రెలు, ఇళ్లస్థలాలు, గృహాలు, వస్త్రాలు, విద్యుత్ వంటి వాగ్దానాలు అప్పుడప్పుడైనా కనీస స్థాయిలో కొంతకాలంపాటు అమలుకు నోచుకుంటున్నాయి. కానీ, ఆర్థిక వేత్తలు ఈ తరహా వాగ్దానాల అమలును కొన్ని బలమైన కారణాలను చూపి వ్యతిరేకిస్తుంటారు. తీవ్రమైన దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు ప్రత్యక్షంగా సాయం అందించాల్సిన అవసరం నేపథ్యంలో- అలాంటి వాగ్దానాల అమలుకు అనుకూలంగా వాదించవచ్చు.

రాజ్యం నిర్వర్తించాల్సిన బాధ్యతలు ఎన్నో ఉన్నాయి. రక్షణ, ఆర్థిక వ్యవస్థల స్థిరత్వాన్ని పరిరక్షించడం, శాంతి భద్రతలు, న్యాయం, ప్రజా హక్కులను కాపాడటం వంటివి రాజ్యం నెరవేర్చాల్సిన ప్రాథమిక బాధ్యతలు. కానీ ఆధునిక కాలంలో క్రమంగా రాజ్యం బాధ్యతలు విస్తృతమవుతున్నాయి. వనరులను, ప్రజల శక్తి సామర్థ్యాలను సంపూర్ణ స్థాయిలో వినియోగించుకోవడంతోపాటు; మౌలిక సౌకర్యాలను అభివృద్ధి పరచి; విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరచడం ప్రస్తుతం రాజ్యం దృష్టి పెట్టాల్సిన కీలక బాధ్యతలు. సాయమందితే తప్ప బతుకుబండి సాగించలేని బాధాసర్పదష్టులు ప్రతి సమాజంలోనూ ఉంటారు. ఇలాంటి మంద భాగ్యులందరికీ భద్రత కల్పించి, బతుకుపై భరోసా కల్పించాల్సిన బాధ్యత రాజ్యంపై ఉంది. ఇప్పటివరకూ దేశంలో వివిధ పార్టీలు ఎన్నికల సమయాల్లో ప్రకటించిన సబ్సిడీలను, తాయిలాలను- పేదలను ఆదుకోవడంకోసం; వనరులను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడంకోసం ఉద్దేశించినవని వాదించి సమర్థించవచ్చు. కానీ 'రంగుల టీవీ వాగ్దానం' మాత్రం ఏ రకంగానూ సమర్థించుకోవడానికి సాధ్యం కానిది. అందువల్లే కరుణానిధి చేసిన ఎన్నికల వాగ్దాన ప్రభావం కేవలం ఈ ఎన్నికలకు, ఒక్క తమిళనాడుకు మాత్రమే పరిమితమయ్యేది కాదు. ప్రజలను మాయచేసేందుకు డి.ఎం.కె. వేసిన ఈ ఎన్నికల ఎత్తులో- సమాజంపట్ల పూర్తిస్థాయి బాధ్యత రాహిత్యం, నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఈ తరహా ఎన్నికల ఎత్తుజిత్తులు ఇలాగే ఎలాంటి అడ్డూ అదుపూ లేకుండా కొనసాగితే- భవిష్యత్తులో ప్రజల పరిస్థితి అనూహ్యంగా దిగజారుతుంది. ఇకమీదట ప్రజలందరికీ ఉచితంగా మోటారు సైకిళ్లను పంచిపెడతామని ఓ పార్టీ, అందరికీ రెఫ్రిజిరేటర్లంటూ మరోపార్టీ, ఇంటింటికీ కారు ఇస్తామని ఇంకో పార్టీ ప్రజలను బులిపించేందుకు ముందుకు రావచ్చు. ఈ మొత్తం ప్రహసనంలో ఆవిరయ్యేది ప్రజాధనమే. ఖజానా కొల్లబోతుంది. ఎవరెక్కువ డబ్బు ఖర్చుపెడితే వారికే అధికారం దక్కే విపరీత పరిస్థితి దాపురిస్తుంది. ఒకసారి ఇలాంటి వాగ్దానాలు అమలు కావడం మొదలైతే ఇక ఆ తరవాత పెద్దగా మార్చేందుకు ఏమీ మిగలకపోవచ్చు. ఆ పరిస్థితే వస్తే దేశాభివృద్ధి క్రమంలో కీలకమైన రంగాలన్నీ వట్టిపోతాయి. విద్యారంగం కుదేలవుతుంది. చదువుకు నోచుకోని లక్షలమంది పేద పిల్లలు నైపుణ్యాలను మెరుగుపరచుకునే దారిలేక అలాగే మిగిలిపోతారు. వైద్యరంగం భ్రష్టుపట్టిపోతుంది. ఇప్పటికే సరైన వైద్యం అందక అల్లల్లాడుతున్న లక్షలమంది పరిస్థితి మరింత అగమ్యంగా తయారవుతుంది. బాధ్యతారాహిత వాగ్దానాలమేరకు ప్రజలకు టెలివిజన్లూ, స్కూటర్లూ అందితే- ప్రభుత్వాలు ఇకమీదట వాస్తవంగా నిర్వర్తించాల్సిన విధులేవీ నిర్వహించలేని నిస్సహాయతలోకి జారుకుంటాయి.

### *అనవసర సంచలనాలు*

ఎన్నికల సందర్భంగా పార్టీలు ప్రకటించే తాత్కాలిక తాయిలాలు ఎన్నటికీ ప్రజల జీవనగతిని మార్చలేవు. ప్రజలకు సేవచేయాల్సిన ప్రతినిధులు- ప్రభువులుగా అవతారమెత్తి జులుం చలాయిస్తారు. ప్రభువులుగా

ఉండి ప్రతినిధులను నిర్దేశించాల్సిన ప్రజలు- నేతల అడుగులకు మడుగులొత్తే దురవస్థకు దిగజారిపోతారు. ఈ ధోరణికి తెరపడాలి. రాజకీయ పార్టీలకు ఏ కొంచెం సిగ్గున్నా, ప్రజలకు సేవ చేయాలన్న తపన వాటిలో ఏ మాత్రమైనా మిగిలి ఉన్నా... ఇలాంటి దుష్ట సంస్కృతికి అడ్డుకట్టవేయడానికి కలిసి రావాలి. తాయిలాల కోసం దేబిరించే హీన స్థితికి ప్రజలను దిగజారుస్తున్న సంప్రదాయానికి చరమగీతం పాడేందుకు చేయీచేయి కలపాలి. ప్రజా జీవితంలోని వాస్తవాంశాలను పట్టించుకోకుండా సంచలనాంశాలకే పెద్దపీట వేస్తూ తీరికలేకుండా ఉన్న ప్రసారసాధనాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. రాజకీయాలను పునర్నిర్వచించే దిశగా ప్రజలను జాగృతం చేయాలి. పార్టీలన్నీ మన ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టించకముందే ఈ పని జరగాలి.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)